


## చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950-ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# సమీక్షకుడు

- విలియం లింక్ అండ్ రిచర్డ్ లివింగ్‌సన్

(కథా కాలం 1965)

తెరపడగానే ఆర్థర్ బయటికి వచ్చి ఖాళీ లాబీలోంచి బయటికి నడుస్తూంటే, వెనకనించి ప్రేక్షకుల చప్పట్లు వినిపిస్తున్నాయి. అతను టేక్సీ కోసం చూస్తూంటే ట్రాఫిక్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ నవ్వుతూ అడిగాడు.

"హిట్టా, కాదా?"

ఆర్థర్ జవాబు చెప్పలేదు. ఓ టేక్సీ అతని ముందుకి వచ్చి ఆగింది. డ్రైవర్ తలుపు తెరిచి చెప్పాడు.

"గుడీవినింగ్ సర్."

ఆర్థర్ వెనక సీట్లో కూర్చుని వెనక్కివాలి జేబులోంచి సిగరెట్ హోల్డర్‌ని తీసాడు.

టేక్సీ ముందుకి సాగింది. ఆ డ్రైవర్ తన ప్రయాణీకుడ్ని గుర్తుపట్టాడు. అనేక డజన్ల సార్లు కొత్త నాటకం ఆరంభం రోజున అతన్ని ఎక్కించుకుని రంగస్థల విమర్శకుడిగా అతను పనిచేసే వెస్ట్ ఫార్టీత్ స్ట్రీట్‌లోని పత్రికాఫీస్‌కి తీసుకెళ్ళాడు.

టాక్సీ దిగి ఆర్థర్ అతనికి డబ్బిచ్చి ఆ బిల్డింగ్‌లోకి వెళ్ళాడు. అతని డిపార్ట్‌మెంట్ రెండవ అంతస్థులో ఉంది. చాలామంది కాఫీ తాగుతూ శ్రద్ధగా పనిచేస్తున్నారు. అతని కేబిన్‌లో ఓ టైప్‌రైటర్, ఏష్‌ట్రే, అతని అభిమాన రచయిత జార్జ్ బెర్నార్డ్ షా బస్ట్ ఉన్నాయి. ఆర్థర్ తన కోటుని, టోపీని తీసి హేంగర్‌కి తగిలించి టైప్ రైటర్ ముందు కూర్చున్నాడు. తను చూసిన ఆ కొత్త నాటకం మీద దారిలో మనసులో కంపోజ్ చేసుకున్న సమీక్షని టైప్ చేయసాగాడు.

'ఇనఫ్ రోప్' అనే నాటకం నిన్న రాత్రి కాల్టన్ థియేటర్‌లో ఆరంభమైంది. ఆ నాటకంలో నటించిన జాక్ వల్ల నాటకం చెడింది. అతనికి నాటకరంగం గురించి సమస్తం తెలుసు. ఒక్క నటన తప్ప. కోతి ఓ చెట్టు కొమ్మ మీంచి ఇంకో కొమ్మమీదికి దూకినంత వేగంగా అతని మొహంలో హావభావాలు దూకి మాయమయ్యాయి. అతను మార్లన్ బ్రాండోకి ఐదో కార్బన్‌కాపీ అని నా ఉద్దేశం. ఆ నాటకం కోటైతే, అతని నటన దాన్ని గుహగా మార్చింది.'

ఆర్థర్ సిగరెట్ వెలిగించుకోడానికి ఆగాడు. అతని కేబిన్ తలుపు తెరచుకుని ఓ మధ్యవయస్కుడు లోపలికి వచ్చాడు. అతని మొహం తెల్లగా ఉండడంతో అది మేకప్‌గా గుర్తించాడు. అతను జాక్ అని, థియేటర్ నించి సరాసరి ఇక్కడికే వచ్చాడని గ్రహించాడు.

"మిస్టర్ ఆర్థర్. మీ సమీక్ష చదవడానికి వచ్చాను" చెప్పాడు.

"అది అసాధ్యం. మీరు రేపు ఉదయం దినపత్రికని కొని దాన్ని చదవాలి."

"మీరు మళ్ళీ నా నటన మీద ఘాటు విమర్శ చేసారనుకుంటాను?" అతను హెచ్చరిస్తున్నట్లుగా అడిగాడు.

"నేనేం రాసానన్నది రేపు ఉదయం దినపత్రికలు షాపుల్లోకి వచ్చేదాకా మీకు సంబంధం లేనిది."

జాక్ అతని టేబుల్ మీద టైప్‌రైటర్‌లోని కాగితాన్ని చూసి చటుక్కున దాన్ని రోలర్‌లోంచి తీసి చదివాడు.

"దుర్మార్గుడా! నువ్వు నిజంగా నాటకానికి వచ్చావా? ఇందాక నా నటనని చూసావా? లేక నిద్రపోయి లేచొచ్చి ఇది టైప్ చేస్తున్నావా?" కోపంగా అరిచాడు.

"దాన్ని నాకిచ్చి వెంటనే మీరు బయటకి వెళ్ళకపోతే పోలీసుల్ని పిలుస్తాను" ఆర్థర్ హెచ్చరించాడు.

జాక్ అతని వంక ఇంకేదో గోళంలోంచి మాట్లాడినవాడిని చూస్తున్నట్లుగా బ్లాంక్‌గా చూసాడు. తర్వాత చేతిలోని కాగితాన్ని ఉండగా నలిపి అతని మీదకి విసిరి వెళ్ళిపోయాడు.

ఆర్థర్ మొహం ఎర్రబడింది. మళ్ళీ ఆ ఉండని తీసుకోకుండా తనజ్ఞాపకం లోంచి తిరిగి టైప్ చేయసాగాడు.

మర్నాడు మధ్యాహ్నం ఆర్థర్ ఓ రెస్టారెంట్‌కి వెళ్ళాడు. కొద్ది దూరంలోని ఓ టేబుల్ ముందు జాక్, అతని పక్కన ఓ లావుపాటి వ్యక్తి కనిపించారు. జాక్ తన వంక కోపంగా చూడటం గుర్తించాడు. వెంటనే జాక్ లేచి కోపంగా బయటికి నడిచాడు.

ఆర్థర్ సిగరెట్ వెలిగించుకుని చుట్టూ చూస్తే సాధారణ పర్యాటకులు, హాలీవుడ్‌లో పనిచేసేవాళ్ళు కనిపించారు.

"మిస్టర్ ఆర్థర్?" జాక్ పక్కన కూర్చున్న వ్యక్తి అతని దగ్గరకి వచ్చి అడిగాడు.

ఆర్థర్ సిగరెట్ వెలిగించుకుని చుట్టూ చూస్తే సాధారణ పర్యాటకులు, హాలీవుడ్‌లో పనిచేసేవాళ్ళు కనిపించారు.

"మిస్టర్ ఆర్థర్?" జాక్ పక్కన కూర్చున్న వ్యక్తి అతని దగ్గరకి వచ్చి అడిగాడు.

చవకదుస్తులు ధరించిన అతను అలాంటి ఖరీదైన రెస్టారెంట్‌కి స్వంత డబ్బుతో డబ్బుతో వచ్చేవాడు కాదని ఆర్థర్‌కి అనిపించింది.

"నా పేరు బర్ట్ జాక్ పర్సనల్ మేనేజర్ని." అతనికి తనని పరిచయం చేసుకున్నాడు.

"నానించి ఏం కావాలి?" ఆర్థర్ విసుగ్గా అడిగాడు.

"మీకు తెలీదేమో కానీ జాక్ మీ సమీక్ష వల్ల చాలా బాధపడ్డాడు. ఓ సమీక్ష వల్ల అతను అంతగా బాధపడడం నేనెప్పుడు చూడలేదు."

"అలా అయితే అతను ఇంకో వృత్తి చూసుకోవడం మంచిది."

"జాక్ సరైన వృత్తిలోనే ఉన్నాడు. అతను బాధపడేలా చేసారు. అతనంటే మీకెందుకు కోపం?" బర్ట్ ముందుకి వంగి అడిగాడు.

"నాకు అతనిమీద వ్యక్తిగతమైన కోపం, ద్వేషం లేవు. మీ బాస్‌కి నటన రాదు. ప్రేక్షకులు తమ డబ్బుని నటనరానివాళ్ళ నాటకానికి ఖర్చు చేయడం మంచిదికాదు. మీరు వెళ్తే నేను నా కాఫీని ముగిస్తాను" ఆర్థర్ చెప్పాడు.

"మీరు జాక్‌కి క్షమాపణ చెప్పండి. అతను ఆ పాత్రకి సరిపోలేదని చెప్పండి తప్ప నటన రాదని కాదు. అందువల్ల అతను శాంతపడతాడు. నిన్న రాత్రినించి కోపంతో పిచ్చివాడయ్యాడు. నా మాట వినడంలేదు."

ఆర్థర్ తల అడ్డంగా ఊపాడు.

ఆర్థర్ బయటికి రాగానే వేచివున్న జాక్ అతనికి తన చేతిలోని కొన్ని దినపత్రికలని చూపిస్తూ ఆవేశంగా అడిగాడు.

"వీటిని చూసావా? ఎనిమిది సమీక్షలు. అన్నీ నా నటనమీద మంచి సమీక్షలే. ఒక్కటి తప్ప. ఆ ఒక్కటి ఎవరు రాసారో తెలుసా?"

దారిన పోయేవాళ్ళు వీళ్ళవంక చిత్రంగా చూసుకుంటూ వెళ్ళారు. ఆర్థర్ జవాబు చెప్పకుండా తన ముందు వచ్చి ఆగిన టేక్సీ ఎక్కి తలుపు మూసుకున్నాడు.

"ఎందుకు నా మీద పగబట్టావు?" జాక్ కోపంగా అరిచాడు.

బర్ట్ వచ్చి తన టేక్సీ వెంట పరిగెత్తే అతన్ని పట్టుకోవడం ఆర్థర్ కదులుతున్న టేక్సీలోంచి చూసాడు.

ఆ రాత్రి ఆర్థర్ కొద్దిసేపు టి.వి చూసాక పడుకోడానికి బెడ్‌రూంలోకి వెళ్ళి, అక్కడ కనపడ్డ జాక్‌ని చూసి నివ్వెరపోయాడు.

"ఇక్కడికి ఎలా వచ్చావు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"తలుపు తెరిచే ఉంది."

"బయటికి నడు."

"నిన్నరాత్రి నించి నేను ఏం తినలేదు."

"బయటికి నడవమన్నాను."

ఆర్థర్ రిసీవర్ అందుకున్నాడు. కానీ డయల్ టోన్ లేదు. చూస్తే ఫోన్ వైర్ కట్ చేసి కనిపించింది.

అతను వెనక్కి తిరిగితే జాక్ ఒక్క గెంతులో వెళ్ళి అతనికి అడ్డు నిలబడ్డాడు.

"నీకేం కావాలి?" ఆర్థర్ విసుగ్గా అడిగాడు.

"మాట్లాడాలి."

"నేను అపాలజీ చెప్పను."

"అక్కర్లేదు. భయపడుతున్నావా?"

"కాదు. నువ్వు ఎప్పుడు బయటికి వెళ్తావా అని చూస్తున్నాను."

"నేను నా పన్నెండవ ఏటనించి నటిస్తున్నాను. అకస్మాత్తుగా రంగస్థలం మీదకి రాలేదు. గత ఇరవైఏళ్ళుగా ఇదే వృత్తిలో ఉన్నాను. నాకు నటన నేర్పినవారు, మిత్రులు, విమర్శకులు కూడా నేను బాగా నటిస్తున్నానని మెచ్చుకుంటున్నారు నువ్వు తప్ప. నీ సమీక్షలు నా వృత్తికి హాని చేస్తున్నాయి."

అతని చెయ్యి కోటుజేబులోకి వెళ్ళి రివాల్వర్‌ని బయటికి తీసింది. తన కుడికంటికి గురిపెట్టబడ్డదాన్ని చూసి ఆర్థర్ ఓ గుటక వేసాడు.

"దీన్ని ఇలాంటి అవసరానికి దాచాను. ఇది నాకెలా వచ్చిందో తెలుసా?"

"తెలీదు"

"నా మంచి మిత్రుల్లో ఒకరు దీంతో ఆత్మహత్య చేసుకున్నారు. అతను కూడా నటుడే అతనికి చాలా వ్యక్తిగత సమస్యలుండేవి. నేనూ ఇక్కడ అదే పనిచేద్దామనుకుంటున్నాను."

"నువ్వు జోక్ చేస్తున్నావు."

"కాదు. ఈ రాత్రి ఇక్కడ ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నానో తెలుసా?"

ఆర్థర్ అయోమయంగా చూస్తూ తల అడ్డంగా ఊపాడు.

"ఎందుకంటే నేనంటే నీకు ద్వేషం. బహుశా నటుడవుదామనుకుని చేతకాక నువ్వు అసూయాతో నాలాంటివాళ్ళ కెరీర్‌ని నాశనం చేస్తున్నావనుకుంటాను. నేను ఇక్కడ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నానా అని అంతా ఆలోచిస్తారు. నా మీద సానుభూతితో నా నటన మీద నీ అన్ని సమీక్షలు చదువుతారు. నువ్వు ద్వేషంతో రాసావని అంతా తప్పక భావిస్తారు. లేదా నువ్వు రివాల్వర్ ప్రమాదంలో మరణిస్తావు. ఈ రెంటిలో దేన్ని కోరుకుంటావ్?"

జాక్ కళ్ళల్లోకి కొద్దిక్షణాలు చూసి ఆర్థర్ వెనక్కి అడుగేసాడు.

"నీ మొహం ఎందుకంత తడిసిపోయింది ఆర్థర్? విమర్శకులు నటులకి, రచయితలకి చెమట పట్టిస్తారని ఇంతకాలం అనుకుంటున్నాను. నీకు నిజంగా భయంగా ఉందా?"

తక్షణం జాక్ చేతిలోని రివాల్వర్ పేలింది. అతను చిన్నగా మూలిగి వెనక్కి విరుచుకు పడిపోయాడు. ఆర్థర్ కొద్దిసేపు కదలకుండా భయంగా నిలబడిపోయాడు. తర్వాత జాక్ వంక చూస్తే, నోరు తెరుచుకుని గాఢనిద్రలో ఉన్నట్లుగా కనిపించాడు. అతని కోటు గుండీలు విప్పి చెవిని ఛాతీమీద ఉంచాడు. అతని శ్వాస ఆడడంలేదని గ్రహించాడు. తర్వాత ఏం చేయాలా అని ఆలోచించాడు. వెంటనే పోలీసులకి ఫోన్ చేయాలి. అందుకు ఇంట్లోంచి బయటికి వెళ్ళి పబ్లిక్ ఫోన్ బూత్‌లోంచి ఫోన్ చేయాలి.

డోర్ బెల్ చప్పుడు విని ఉలిక్కిపడ్డాడు. నివ్వెరపాటుతో నిద్రలోంచి నడుస్తున్నట్లుగా వెళ్ళి తలుపు తెరిచాడు.

బయట బర్ట్ నవ్వుతూ కనిపించాడు. అతని వెనక ఇద్దరు విలేకర్లు, ఫోటోగ్రాఫర్లు కూడా ఉన్నారు.

"ఏమైంది?" ఆర్థర్ మొహంలోంచి సీరియస్‌నెస్‌ని గ్రహించి అడిగాడు.

"జాక్ మరణించాడు. ఆత్మహత్య చేసుకున్నాడు."

"అవునా? ఎందుకు?"

"అతనికి నటన రాదని నేను రాసిన సమీక్షకి హర్ట్ అయి."

"నిజంగా పోయాడా?" ఓ విలేకరి అడిగాడు.

"అవును" ఆర్థర్ కంపిస్తూ చెప్పాడు.

"ఇప్పటికైనా నాకు నటన వచ్చని ఒప్పుకుంటావా?"

ఆ మాటలకి ఆర్థర్ గిరుక్కున వెనక్కి తిరిగి చూస్తే, జాక్ నవ్వుతూ కనిపించాడు.

"నా నటనతోనే గుండాగి మరణించాననే భ్రాంతిని నీలో కలిగించాను. నేను మంచి నటుడ్నో లేక నువ్వు రాసినట్లు చెడ్డ నటుడ్నో రేపు పేపర్ చదివిన ప్రజలు నిర్ణయిస్తారు" జాక్ నవ్వుతూ చెప్పాడు.

**(వచ్చేనెల మరోకథ)**

Post your comments